

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం 6:26(సాయంత్రం)

సెహరీ : మంగళవారం 4:44 (ఉదయం)

దౌర్జన్యాలు.. దాడులు



నంద్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాలకు ప్రత్యేకత ఉంది. రాజకీయ రంగంలోనేగాక వాణిజ్యపరంగా కూడా గుర్తింపు ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నంద్యాలలో నేరాల సంఖ్య విపరీతంగా పెరిగింది. హత్యలు, భూకబ్జాలతో నంద్యాల పట్టణం అట్టుడికిపోయింది. వైసీపీ నేతల నిర్వాకంతో ఓ మైనారిటీ కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. పెచ్చుమీరిన రౌడీయిజంతో ఏకంగా ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయాడు. ఇలాంటి నేరాలతో నంద్యాల అరాచకాలకు అడ్డా అనే అపఖ్యాతిని మూటగట్టుకుంది. హింస, నేరం, దౌర్జన్యం అరికట్టాల్సిన స్థానిక ప్రజాప్రతినిధి రౌడీలకు, గుండాలకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన ఏలుబడిలో నంద్యాల అభివృద్ధిలో వెనుకబడి, అకృత్యాల్లో దూసుకుపోతోందన్న విమర్శ ఉంది.

- వైసీపీ ఐదేళ్ల పాలనలో అట్టుడికిన నంద్యాల
- హత్యలు, భూ కబ్జాలతో చెలరేగిన అధికార పార్టీ నేతలు, రౌడీ షీటర్లు
- వీళ్లంతా స్థానిక ప్రజాప్రతినిధి మనుషులేనన్న ఆరోపణలు



వైసీపీ ప్రభుత్వంలోకి రాగానే ఆ పార్టీ నేతలంతా ఇక అధికారమంతా తమదేనన్న రీతిలో వ్యవహరించడం మొదలు పెట్టారు. తాము ఏది చెబితే అది జరిగిపోవాలన్న ధోరణిలో ప్రవర్తించారు. వైసీపీ నేతల్లో ఇలాంటి వ్యవహార శైలి నంద్యాలకు చెందిన అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్యతో మొదలైంది. ఓ చోరీ కేసులో నేరం ఒప్పుకోవాలంటూ పోలీసులు చేసిన ఒత్తిడి తట్టుకోలేక 2020 నవంబర్ 3వ తేదీన నంద్యాల పట్టణానికి చెందిన అబ్దుల్ సలామ్ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పాణ్యం సమీపంలో రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. చేయని నేరాన్ని అబ్దుల్ సలాం ఒప్పుకునేలా చేయాలంటూ పోలీసులపై నంద్యాల నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాడన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. ఈ కేసులో పోలీసులపై కేసు నమోదై జైలు పాలయ్యారు గానీ, తెరవెనుక ఉండి ఓ కుటుంబం ఆత్మహత్యకు కారణమైన వైసీపీ నేతలు మాత్రం దర్జాగా బయట తిరుగుతున్నారు. వారెవరో తెలిసి కూడా ఆ ప్రజాప్రతినిధి వారిపై కనీస చర్యలు తీసుకోకపోగా, వారిపైన ఎలాంటి కేసు నమోదు కాకుండా వెనకేసుకొని వచ్చాడన్న విమర్శలున్నాయి.



ఎస్ ట్యాక్స్

ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలు బియ్యం, మట్టి, ఇసుక ఇలా అన్నిటి నుంచి భారీగా సంపాదించుకున్నారు. కుందూ నది వెంట మట్టి తవ్వకాల్లో ప్రజాప్రతినిధి అనుచరులు వాటాలు దండుకుని మరీ అక్రమంగా తరలించారన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి ట్రాక్టరుకు ఇంత అని ఎస్ ట్యాక్స్ పేరిట వసూలు చేసేవారన్న ఆరోపణలున్నాయి. బండి ఆత్మకూరు మండలానికి సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాల్లో కూడా ప్రజాప్రతినిధి మనుషుల చేతివాటం ఉందన్న ఆరోపణలున్నాయి. ఇక రేషన్ బియ్యం అక్రమ రవాణా కూడా పట్టణంలో విపరీతంగా పెరిగిపోయింది. ఇలాంటి వారంతా ఏకంగా మాఫియా లీడర్ల మాదిరి తయారయ్యారు. ఎక్కడైనా పోలీసులు దాడులు చేసి పట్టుకుంటే.. ప్రజాప్రతినిధితో దిగిన ఫొటోలు చూపించి తమపైనే దాడులకు దిగుతారా? అంటూ బెదిరించే స్థాయికి వెళ్లారని తెలుస్తోంది. ప్రజాప్రతినిధి అభయహస్తం లేనిదే పోలీసులకు ఎదురు తిరుగుతారా? అన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇదంతా ఓ ఎత్తు. అయితే ఇక చిన్నా చితక వ్యాపారాలు చేసుకునే వారి నుంచి డబ్బులు దండుకునే బ్యాచ్ కూడా రెచ్చిపోవడం గమనార్హం. గతేడాది దీపావళి సందర్భంగా స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాదారుల నుంచి దాదాపు రూ.40 వేలు దండుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపించాయి.

రౌడీలతో చెట్టాపట్టాల్..



2021 మార్చి 24న నంద్యాల ఎన్‌జీవోస్ కాలనీలో రౌడీ షీటర్ రాజశేఖర్ నడి రోడ్డుపై దారుణ హత్యకు గురయ్యారు. రాజశేఖర్ గతంలో నంద్యాల, కర్నూలు అపార్టుమెంట్లలో జరిగిన జంట హత్య కేసులలో ప్రధాన నిందితుడు. తోటీ రౌడీ షీటర్లతో సెటిల్‌మెంట్ పంపకాలలో తలెత్తిన విభేదాలు తలెత్తడంతోనే రాజశేఖర్ ప్రాణాలు కోల్పోయాడు. హత్యకు పాల్పడిన నిందితుడు స్థానిక ప్రజాప్రతినిధి సన్నిహితుడన్న ఆరోపణలున్నాయి. ఇక 2022 ఆగస్టు 7వ తేదీన రౌడీ షీటర్ల చేతిలో డీఎస్పీ కార్యాలయ కానిస్టేబుల్ సురేంద్ర దారుణ హత్యకు గురైన ఘటన రాష్ట్రంలోనే సంచలనం రేపింది. ఈ హత్య కేసులోని 12 మంది నిందితుల్లో ఒకరు ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడు. పైగా అతను గతంలో ఓ దేవస్థానం ఛైర్మన్ పదవి కూడా చేపట్టాడు. ఇక వీరిలో ఓ నిందితుడిని మొన్నటి వరకు పోలీసులు పట్టుకోలేకపోవడం వెనుక కూడా ప్రజాప్రతినిధి హస్తం ఉందన్న విమర్శలున్నాయి. కానిస్టేబుల్‌ను హత్య చేసిన నిందితులను ప్రజాప్రతినిధి కడప జైలుకు వెళ్లి పలకరించారని, ఆయన అండదండలతోనే నంద్యాలలో క్రైం రేటు పెరిగిందని వైసీపీ స్థానిక సీనియర్ నేత అప్పట్లో మీడియా ఎదుట సంచలన వ్యాఖ్యలు చేశాడు. సొంత పార్టీలోని వ్యక్తే ఇలాంటి వ్యాఖ్యలు చేశాడంటే ఆ ప్రజాప్రతినిధి ఏ స్థాయిలో రౌడీలతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నాడో అర్థమవుతోంది.

స్థలం కనిపిస్తే కబ్జా..

నంద్యాల జిల్లాలో స్థలాలకు విపరీతమైన ధరలు ఉన్నాయి. పట్టణం నడిబొడ్డును సెంటు స్థలం రూ. కోటి నుంచి కోటిన్నర వరకు పలుకుతున్నదంటే అర్థం చేసుకోవచ్చు ఇక్కడ భూములకు ఉన్న డిమాండ్. ఖాళీ స్థలాలు, ఇళ్లను కబ్జా చేసేందుకు వైసీపీ నేతలు వాలిపోతున్నారు. రెండేళ్ల కిందట పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని ఓ మహిళ ఇంటిని స్థానిక ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు, మున్సిపల్ కౌన్సిల్‌లో కీలక పదవి వెలగబెడుతున్న వైసీపీ నేత కబ్జాకు యత్నించాడు. ఆ ఇల్లు తనదంటూ సదరు వైసీపీ నేత ఎక్స్‌కవేటర్‌తో కాంపౌండ్ కూల్చేందుకు పూనుకున్నాడు. బాధిత మహిళ వైసీపీ నేత దాష్టికాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటం పట్టణంలో కలకలం రేగింది. సదరు వైసీపీ నేత స్థానిక ప్రజాప్రతినిధి అండ చూసుకుని పట్టణంలో పలు విలువైన స్థలాలను తన పరం చేసుకున్నాడన్న ఆరోపణలు లేకపోలేదు. అదే నాయకుడే పట్టణంలోని పలు స్థలాలను ఆక్రమించుకున్నారే ఆరోపణలు ఉన్నాయి. ఇక ఇటీవలే నంద్యాల పట్టణ శివారులోని రూ.50 కోట్ల విలువైన 2.5 ఎకరాల మున్సిపల్ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారు. ఈ విషయం బట్టబయలు కావడంతో తీవ్ర దుమారం రేగింది. ఇలా వైసీపీ నేతలు సాగిస్తున్న కబ్జాలలో ప్రజాప్రతినిధికి వాటాలు ఉన్నాయని, లేకపోతే తన పార్టీకి చెందిన వారు ఈ స్థాయిలో రెచ్చిపోతున్నా, ఎందుకు ఉపేక్షిస్తున్నారన్న విమర్శలు నియోజకవర్గ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.



వారిలో వారికే పొసగక..



నంద్యాల పట్టణంలో స్థలాలకు విపరీతమైన డిమాండ్ రావడంతో ఇతర నియోజకవర్గాల వైసీపీ నేతల కన్ను కూడా ఈ ప్రాంతంపై పడింది. అయితే ఇతరుల నియోజకవర్గాల్లో తాను చేతులు పెట్టడం లేదు కదా! తన నియోజకవర్గం ఇతరులు జోక్యం చేసుకోవడం ఏమిటనేది ప్రజాప్రతినిధి వైఖరి. ఇలా వీరిలో వీరే గొడవ పడుతూ తమ కబ్జాల వ్యవహారం బట్టబయలు చేసుకున్నారు. నంద్యాలలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన ఓ స్థల వివాదం స్థానిక ఎమ్మెల్యే, జిల్లాలోని మరో నియోజకవర్గం నేతకు సంబంధించిన వర్గీయుల మధ్య ఘర్షణ రేగింది. అది కాస్త చిలికి చిలికి గాలివానలా మారడంతో వ్యవహారం పోలీసు స్టేషనుకు చేరింది. అయితే ఒక వర్గం వారికి స్థానిక ప్రజాప్రతినిధి అండ, మరో వర్గానికి పక్కన నియోజకవర్గ వైసీపీ నాయకుడి అభయం ఉండటంతో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేయలేకపోయారు. ఎందుకు వచ్చిన తలనొప్పి అని, సివిల్ కేసు కాబట్టి కోర్టుకు వెళ్లమని చెప్పి పోలీసులు తప్పించుకున్నారు. ఇలా నంద్యాల నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో చెప్పడం కష్టమేగాని నేరాలు - ఘోరాలు మాత్రం పెచ్చరిల్లాయని ప్రజలు వాపోతున్నారు.

రాత్రి గస్తీ ముమ్మరం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు రాత్రి గస్తీ ముమ్మరం చేశారు. ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణకు రాత్రి పూట గస్తీ ముమ్మరం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. గస్తీ విధుల్లో భాగంగా రాత్రిళ్లు జిల్లాలోని అన్ని పట్టణాల్లోని ముఖ్య కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 3నుంచి 5గంటల మధ్యలో జిల్లా సరిహద్దుల నుంచి జిల్లాలోకి ప్రవేశించే హెవీ వెహికల్ డ్రైవర్లకు తరచూ స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డ్రైవర్లు విశ్రాంతి లేకుండా వాహనాలు నడుపుతుండటంతో నిద్రమత్తులో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి ఇలా చేస్తున్నామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టినట్లు తెలిపారు. ఆలయాలు, ఏటీఎం, ప్రభుత్వ వైన్‌షాప్స్ ఇతర వ్యాపార సముదాయాల వద్ద అప్రమత్తంగా తిరుగుతూ అనుమానిత వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. లాడ్జీలు, రైల్వే, బస్ స్టేషన్లలో బస చేసే కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా రాత్రి గస్తీలో తిరిగే పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదివారం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. రాత్రిళ్లు అనవసరంగా తిరిగే వారిపై దృష్టి సారించాలన్నారు. బీట్‌లలో సిబ్బంది వారి స్టేషన్ పరిధిలోని నేరచరిత్ర గలవారిపై, అనుమానితులపై నిఘా ఉంచాలని తెలిపారు. అనుమానితుల వేలిముద్రలు తీసుకోవాలని, రాత్రి పూట దొంగతనాలు, అల్లర్లు, గొడవలు జరగకుండా చూడాలన్నారు. అకారణంగా రోడ్లపై తిరిగే ఆకతాయిలలు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలోని నేరచరిత్ర గల వారిపై, అనుమానితుల వివరాలు వారి అడ్రస్, ఫోన్ నెంబర్లతో సహా బీట్‌బుక్స్‌లో పొందుపరచాలని ఆదేశించారు.

కైలాస వాహనంపై శ్రీశైలేశుడు



- మహా దుర్గగా అమ్మవారి దర్శనం
- వైభవంగా గ్రామోత్సవం
- ఆది దంపతులను చూసి పరవశించిన భక్తులు
- నేడు ప్రభోత్సవం, నంది వాహన సేవ
- అమ్మవారికి మహాసరస్వతి అలంకారం





మహిళల కోలాటం



భక్తుల విన్యాసాలు

శ్రీశైలం, ఏప్రిల్ 7: ఇల కైలాసంగా వెలుగొందుతున్న శ్రీశైలం మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబికాదేవిని మహాదుర్గగా అలంకరించారు. ఉత్సవానికి ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన కైలాస వాహనంపై అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు అర్చనలు, హారతి పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలకి తోడ్కొనివచ్చి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాధికాలను నిర్వహించి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో అశేషంగా భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవం ముంగిట కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. కైలాస వాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకున్నారు. గ్రామోత్సవంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రభోత్సవం, అమ్మవారికి మహా సరస్వతి అలంకారం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం సాయంత్రం ఆదిదేవులకు ప్రభోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ, మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటలకు వీరాచార్య విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



శ్రీశైలంలో కిక్కిరిసిన భక్తులు



భక్తుల వేషధారణలు



పోలింగ్‌లో ఈవీఎంలు

నంద్యాల జిల్లాలో 1621 పోలింగ్ కేంద్రాల్లో 3890 ఈవీఎంలు ఏర్పాటు: రానున్న సార్వత్రిక ఎన్నికల సంబంధించి నంద్యాల జిల్లాలో మొత్తం 1621 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 3890 ఈవీఎంలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలోని ఆళ్లగడ్డలో 395, శ్రీశైలంలో 226, నందికొట్కూరులో 251, నంద్యాలలో 281, బనగానపల్లిలో 277, డోన్‌లో 291 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి విడివిడిగా ఈవీఎంలను ఏర్పాటు చేస్తారు. ఈ లెక్కన జిల్లాలోని మొత్తం 1621 పోలింగ్ కేంద్రాలకు గాను 3242 ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి వుంటుంది. అయితే పోలింగ్ రోజున ఈవీఎంలు సాంకేతిక లోపం, ఇతర ఏదైనా సమస్యతో మొరాయించే అవకాశం ఉండటంతో ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల సంఖ్యను పరిగణలోకి తీసుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అదనంగా 20శాతం ఈవీఎంలను అందుబాటులో ఉంచుతారు. ఈ లెక్కన ప్రస్తుతం మన నంద్యాల జిల్లాలో 3890 ఈవీఎంలను ఎన్నికల అధికారులు సిద్ధం చేసినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది.

- ఈ విధానంలో చెల్లని ఓట్లు ఉండవు
- ఓట్ల లెక్కింపు సులభతరం
- నంద్యాల ఉప ఎన్నికలో తొలిసారిగా వీవీప్యాడ్స్ వినియోగం
- జిల్లాలో 1621 పోలింగ్ కేంద్రాల్లో 3890 ఈవీఎంల ఏర్పాటు

ఆత్మకూరు, ఏప్రిల్ 7:

ఒకప్పుడు ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు కీలకం. బ్యాలెట్ పత్రంలో అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ కేటాయించిన గుర్తుపై ఓటు వేసేవారు. ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చిందీ లెక్కించేవారు. దాని ప్రకారం గెలుపు ఓటములు నిర్ణయించేవారు. అయితే బ్యాలెట్ పత్రాల వినియోగంలో పలు లోపాల వల్ల అభ్యర్థుల విజయాలు సైతం తారుమారయ్యేవి. దీనికి చెల్లని ఓట్లు కూడా కారణం. బ్యాలెట్ పత్రంలో నిర్ణయించిన గడిలో కాకుండా రెండు గడుల్లో గుర్తుపడేలా కొందరు ఓటర్లు ఇంకుతో స్వస్తిక్ ముద్ర వేసేవారు. మరికొందరు బ్యాలెట్ పత్రంలో వేసిన స్వస్తిక్ గుర్తు ఇంకు మరో అభ్యర్థి పేరు మీద అంటేలా మడిచేవారు. అట్లాగే బ్యాలెట్ పేపర్లు చినిగిపోయినవాటిని, గుర్తు సక్రమంగా పడని వాటిని చెల్లని ఓట్లుగా ఎన్నికల అధికారులు నిర్ధారించేవారు. అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) అందుబాటులోకి రావడంతో చెల్లని ఓట్లకు అవకాశం లేదు. ఈవీఎంలలో అభ్యర్థుల పేరు, పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థుల ఫొటోలను కూడా పొందుపరుస్తున్నారు. ఈవీఎంల పనితీరులో భాగంగా బ్యాలెట్ యూనిట్‌లో పోటీ చేయనున్న అభ్యర్థుల పేర్ల ముందు ఉన్న బటన్లలో ఏ అభ్యర్థికి అయితే ఓటు వేయాలనుకున్నామో ఆ అభ్యర్థి పేరు వద్ద బటన్ నొక్కడంతో బీప్ సౌండ్‌తో ఆ అభ్యర్థి పేరు వద్ద వున్న లైట్ వెలిగి ఓటు నమోదవుతోంది. అయితే తమ ఓటు తాము ఎంపిక చేయబడ్డ అభ్యర్థికే నమోదు అయిందో లేదో తెలుసుకునేందుకు వీవీప్యాడ్స్‌ను వినియోగిస్తున్నారు.



ఈవీఎంల వినియోగంతో ఓట్ల లెక్కింపు సులభం

ఈవీఎంలు రాకముందే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు జరిపేందుకు గంటల కొద్ది సమయం పట్టేది. చాలా మంది సిబ్బంది అవసరం వుండేది. దీనికితోడు చెల్లని ఓట్లు అభ్యర్థులు గెలుపోటములపై ప్రభావం చూపేది. కాబట్టి చెల్లని ఓట్ల గణించడం ఒక ముఖ్యమైన విషయంగా ఉండేది. అయితే ఈవీఎంల వినియోగం వల్ల ఓట్ల లెక్కింపు తక్కువ సమయంలోనే జరుగుతోంది. అంతేకాకుండా సిబ్బంది కూడా తగిన పరిమితిలో వుంటే సరిపోతోంది. ప్రత్యేకించి ఈవీఎంల వినియోగంలో ఒక్క ఓటు కూడా వృథా కాదు. దీని కోసమే ఎన్నికల కమిషన్ ఈవీఎంలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇదిలావుంటే ఈవీఎంల పనితీరులో లోపాలు ఉన్నాయని, ఓ పార్టీకి ఓటు వేస్తే మరో పార్టీకి నమోదవుతోందని పలు సందర్భాల్లో ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ నిర్ధారణ కాలేదు. అయితే ఎన్నికల్లో మరింత పారదర్శక కనిపించేలా వీవీప్యాడ్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈవీఎంలో నిర్ణయించిన అభ్యర్థి పేరు ఎదుట బటన్ నొక్కడానే బీప్ సౌండ్‌తో పాటు వీవీ ప్యాడ్స్‌లో అభ్యర్థికి నిర్ణయించిన నంబర్, పార్టీ గుర్తు ఓటరు 7సెకన్ల పాటు కనిపిస్తుంది. ఈ స్లిప్‌లన్నీ ఒక బాక్స్‌లో పడిపోతాయి. దీంతో ఓటరు తాను నిర్ణయించుకున్న అభ్యర్థికే తన నమోదైన విషయాన్ని నిర్ధారించుకుంటారు. అయితే బ్యాలెట్ యూనిట్‌లోని ఓట్ల లెక్కింపులో ఏదైనా అనుమానాలు వుంటే వీవీప్యాడ్ యూనిట్‌లోని స్లిప్‌లను లెక్కించి అనుమానాలను నివృత్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. కాగా మన జిల్లాలో 2017లో నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల్లో తొలిసారిగా వీవీప్యాడ్స్‌ను ఉపయోగించడం గమనార్హం.





ఈవీఎంలపై మరింత సమాచారం

దేశంలో 1952 నుంచి ఎన్నికల విధానం అమల్లోకి వచ్చింది. సుమారు మూడు దశాబ్దాలు బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లు వేసేవారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్వస్తిక్ గుర్తులను ఎన్నికల్లో వినియోగించేవారు. ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను అందుబాటులోకి తెచ్చారు. అయితే 42ఏళ్ల కిందటే దేశంలో ఈవీఎంలను అందుబాటులోకి తెచ్చారు. మొదటిసారిగా 1982లో కేరళలోని పరూర్ నియోజకవర్గంలో ఈవీఎంలను ఉపయోగించారు. 1982 నుంచి 1983 వరకు వివిధ ఉప ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. 1984లో ఈవీఎంలపై ఫిర్యాదులు రావడంతో సుప్రీంకోర్టు వాటిని ఉపయోగించరాదని ఆదేశించింది. 1990లో ఈవీఎంలలోని సాంకేతిక లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. 1998 నుంచి ఈవీఎంల వాడకం మళ్లీ మొదలైంది. అయితే ఈవీఎంల పనితీరుపై వెల్లువెత్తిన ఆరోపణలతో మరింత పారదర్శకతను పాటించేలా ఈవీఎంలలో వీవీప్యాడ్స్‌ను వినియోగిస్తున్నారు. ఏది ఏమైనా ఈవీఎంల వాడకంతో విలువైన ఓట్లు వృథా కాదు. ఇది ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుస్తున్నదని చెప్పవచ్చు.

స్ట్రాంగ్ రూం కేంద్రాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: రాయలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లను, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆదివారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మౌర్య మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బ్లాక్‌లో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్స్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. యూనివర్సిటీ ఆవరణ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి తాగునీరు, భోజన సదుపాయం, బాత్‌రూముల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ ఇంజనీర్ రవిప్రకాష్ ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా కార్మిక శాఖ సహాయ కమిషనర్ బషీరున్నీసా బేగంను నియమించినట్లు తెలిపారు. నిత్యావసర సేవలందించే 33 విభాగాల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చునని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు అర్హత ఉన్న సిబ్బంది ఫారం -12 డీ ద్వారా వివరాలను పొందుపరిచి దరఖాస్తును సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని కోరారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలు పడిన వారు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీశైలంలో భద్రత ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఏఎస్పీ, పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, ఏప్రిల్ 7: శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాల ఏర్పాట్లు, పోలీస్ భద్రతా చర్యలను ఆదివారం ఏఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఇందులో భాగంగా ఏఎస్పీ శ్రీశైల క్షేత్ర పరిధిలోని రథ వీధిని, అగ్నిగుండ ప్రవేశ ప్రాంగణం, పార్కింగ్ తదితర ప్రదేశాలలో పర్యటించి భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. క్షేత్ర పర్యటనకు ముందుగా భ్రమరాంబ అతిథి గృహం నందు ఉగాది మహోత్సవాల ఏర్పాట్ల సమీక్షలో ఏఎస్పీ కె. ప్రవీణకుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధకారులు, ఆలయ భద్రతా విభాగం అధికారులు, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రభోత్సవం, రథోత్సవం జరిగే సమయంలో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే సోమవారం రాత్రి శివదీక్షా శిబిరాలలో జరిగే అగ్నిగుండ ప్రవేశం, వీరచార విన్యాసాల కార్యక్రమాలకు కన్నడ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. అలాగే వైద్యసేవలు, అగ్రిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, భక్తులు అగ్ని గుండంలోనికి ప్రవేశించకుండా చుట్టూ పటిష్టమైన కంచె ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని గుండ ప్రవేశం, వీరచార విన్యాసాల కార్యక్రమాలను భక్తులందరూ వీక్షించే విధంగా గంతంలో వలె ఎల్‌ఈడీ స్క్రీన్లలో ప్రసారం చేయాలన్నారు. ఉత్సవాలు పూర్తి అయ్యేవరకు కమాండ్ కంట్రోల్ రూము నందు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదేశించారు.

డ్రగ్ డీలర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు

అధ్యక్షుడిగా వై.పుల్లయ్య, కార్యదర్శిగా ఎం.శ్రీధర్



డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో ఎన్నికల పరిశీలకులు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 7: కెమిస్ట్ భవన్‌లో ఆదివారం కర్నూలు జిల్లా మొట్టమొదటి డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా కడప జిల్లాకు చెందిన అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు టి.నరసింహమూర్తి, టి.వెంకటేశ్వర్లు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు శివకుమార్‌గా వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా 894 మంది సభ్యులుగా ఉన్న అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఉన్న వై.పుల్లయ్య (కర్నూలు), జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టీడీపీలో చేరిన సీపీఎం కార్యకర్తలు



సీపీఎం నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, పంచలింగాల నాగరాజు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 7: కర్నూలు రూరల్ మండలం ఇ-తాండ్రపాడుకు చెందిన సుమారు 200 మందికి పైగా సీపీఎం కార్యకర్తలు టీడీపీ కోడుమూరు మాజీ ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. పసుపు కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక టీడీపీ నాయకుడు శేషన్న ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు మునిస్వామి, తిరుమలేష్, వెంకన్న, తిరుపాల్, గరీబ్‌బాషా తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు మాట్లాడుతూ రాబోయేది టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ఎన్డీయే ప్రభుత్వమేనని అన్నారు.

డోన్‌లో కొండముచ్చు హల్చల్

ఐదుగురికి గాయాలు

డోన్(రూరల్), ఏప్రిల్ 7: పట్టణంలో కొండముచ్చు కోతి ఆదివారం హల్చల్ చేసింది. పట్టణంలోని పాతపేట ప్రాంతంలో చిన్నారులు, వృద్ధులపై దాడి చేయడంతో ఐదుగురు గాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు. అలాగే పట్టణంలోని పలు ప్రదేశాల్లో కూడా కొండముచ్చు దాడికి గురై ఆసుపత్రికి చేరిన కేసులు పది దాకా వచ్చాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పట్టణంలోని పాతపేటకు చెందిన చిన్నారులు హరీష్, చక్రధర్, ఆదర్శ కుమార్, వృద్ధులు నారాయణ, పార్థసారథి తదితరులు కొండముచ్చు దాడిలో గాయపడిన వారిలో ఉన్నారు. కొండముచ్చుల బెడద అధికమైందని, అటవీ అధికారులు వాటిని పట్టుకుని అటవి ప్రాంతాల్లోకి వదిలివేయాలని టీడీపీ పట్టణ యువ నాయకుడు హనుమంతరెడ్డి కోరారు.

వడదెబ్బతో కన్నడ భక్తురాలు మృతి

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 7: ఆత్మకూరు మండలంలోని నాగలూటి వీరభద్రాలయం ప్రాంతంలో ఇందిరాబాయి (37) అనే కన్నడ భక్తురాలు వడదెబ్బ సోకి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా వాసి అయిన ఇందిరాబాయి పది రోజుల నుంచి కాలినడకన శ్రీశైలానికి ప్రయాణం సాగించింది. అయితే వెంకటాపురం గ్రామం నుంచి నాగలూటి వీరభద్రాలయం చేరుకొని అక్కడ ఉన్న మెట్ల మార్గంలో కాలినడక మార్గంలో వడ దెబ్బసోకి ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. దీంతో స్థానికులు అక్కడి వైద్యాధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఆమెను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతురాలి వివరాలు సేకరించి వారి బంధువులకు సమాచారం అందించారు

స్కూటీపై నుంచి పడి ఉపాధ్యాయురాలు మృతి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 7: ఆళ్లగడ్డ మున్సిపాల్టీ పరిధిలోని పడకండ్ల వద్ద జరిగిన స్కూటీ ప్రమాదంలో కోవెలకుంట్లకు చెందిన ఉపాధ్యాయురాలు రాధాబాయి(28) మృతి చెందింది. భర్త హేమ్లానాయక్‌తో కలిసి అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు స్కూటీపై వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి కోవెలకుంట్లకు ఆదివారం వెళ్తుండగా పడకండ్ల వద్ద వారు ప్రయాణించే స్కూటీ అదుపు తప్పి కింద పడింది. ప్రమాదంలో కింద పడ్డ రాధాబాయి తలకు తీవ్ర గాయమైంది. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు రాధాబాయి కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు మండల పరిషత్ పాఠశాలలో, భర్త హేమ్లానాయక్ ఆదోని మండలంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వీరికి మూడేళ్ల చిన్నారి ఉంది.

భానుడి భగభగలు



- ఉమ్మడి జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తీవ్ర వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 7: ఉమ్మడి కర్నూలు జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని రోజురోజుకు తీవ్రతరం చేస్తుండటంతో ప్రజలు నిప్పులపై నడుస్తున్నట్లుగా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కర్నూలు జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత.. నంద్యాల అదే స్థాయిలో 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతగా ఆదివారం నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదే విదంగా మంత్రాలయంలో 45 డిగ్రీలు, నంద్యాల జిల్లా చాగల మర్రి 45.8, బనగానపల్లెలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్న నియోజకవర్గాల్లో రాష్ట్రంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాలో మొదటి స్థానంలోకి రావడం ఆందోళనలు కలిగిస్తున్నాయి. కర్నూలు జిల్లాలో గోనెగండ్లలో 41.6, గూడూరులో 42.7, హాలహర్విలో 40.4, హొళగుంద లో 42.5, కల్లూరులో 41.6, కోడుమూరులో 43.4, కోసిగిలో 41.3, కౌతాళంలో 41.6, క్రిష్ణగిరిలో 42, కర్నూలులో 42, మద్దికెరలో 41.4, నందవరంలో 41.8, ఓర్వకల్లులో 42.6, పత్తికొండలో 41.5, పెద్దకడుబూరు 40.6, తుగ్గలిలో 40.4, వెల్దుర్తిలో 41.6, ఎమ్మిగనూరులో 42, అలాగే నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డలో 43.4, ఆత్మకూరులో 43.3, బండి ఆత్మకూరులో 43.4, బేతంచెర్లలో 41.1, డోర్నిపాడులో 43.3, గడివేములలో 43.5, జూపాడుబంగ్లాలో 42.2, కోయలకుంట్లలో 43.3, కొలిమిగుండ్లలో 43, కొత్తపల్లిలో 43.1, మహానందిలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఘనంగా కవి సమ్మేళనం



సమ్మేళనంలో కవులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

నంద్యాల రూరల్, ఏప్రిల్ 7: నంద్యాల పట్టణంలోని రోటరీ భవన్‌లో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం జరిగింది. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో నూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డా. గెలివి సహదేవుడు, సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, చిన్నయ్య సూరి సాహితీ సమితి అధ్యక్షులు డా. రమణ మూర్తి, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాస రెడ్డి, అవధాని డా. గంగుల నాగరాజు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. కవులు ముర్తుజా, డా. కిశోర్ కుమార్, డా. కళామురళి, నీలకంఠామాచారిలతో పాటు తెలుగు భాషా పండితులు డా. నీలం వెంకటేశ్వర్లు, జి. నరేం ద్ర, బాలరాజు, శేషఫణి, మధుసూధన్, మహమ్మద్ రఫీ, కొప్పుల ప్రసాద్, భాషోపాధ్యాయ సంస్థ కార్యదర్శి కన్నయ్య ప్రిన్సిపల్ మరియదాస్ తదితరులు తెలుగు సంసంస్కృతి, ఉగాది పచ్చడి, వసంతాగమనం, వర్తమాన సమస్యలతపై కవితలు వినిపించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు దండెదస్తగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో క్లబ్ మాజీ అధ్యక్షులు కల్లూరి రామలింగా రెడ్డి, కందుకూరు శ్రీరామమూర్తి, చిన్నపురెడ్డి, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డా. విజయభాస్కర్ రెడ్డి రొటేరియన్‌లు నాగరాజు, కైలాసనాధరెడ్డి, విజయశేఖర్ రెడ్డి, జయకృష్ణ, సుబ్బరామయ్య తదితరులు పాల్గొని కవులను సత్కరించారు.

'రాజ్యాధికారంతోనే బెస్తల అభ్యున్నతి'



మాట్లాడుతున్న బెస్త జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాజశేఖర్

నంద్యాల(నూనెపల్లె), ఏప్రిల్ 7: రాష్ట్రంలో రాజకీయ పార్టీలు బెస్తలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని, రాజ్యాధికారం సాధించినప్పుడే బెస్తల అభ్యున్నతి సాధ్యమని ఆ సంఘం జేఏసీ చైర్మన్ రాజశేఖర్ అన్నారు. నంద్యాల్లోని తెలుగుపేటలో ఉన్న జంబులా పరమేశ్వరీ సమావేశ భవనంలో బెస్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు పూర్తయినా బెస్తలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనకబాటులో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బెస్తలకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పదవులు కల్పించాలని డిమాండ్ చేశారు. బెస్తల సాధికారత కోసం పలు చోట్ల స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలో దించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆసంఘం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్ర, పుట్టా శివ, రాయలసీమ జిల్లాల నాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

కొత్తపల్లి, ఏప్రిల్ 7: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయసూర్య అన్నారు. ఆదివారం సాయంత్రం కొత్తపల్లిలోని ఆ పార్టీ మండల కన్వీనర్ నారపురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శంఖారావం, బాబు సూపర్ సిక్స్ కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికి తిరిగుతూ టీడీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో మోసపు వాగ్దానాలతో సైకో జగన్‌ను ఇంటికి పంపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేనల జెండాల అజెండా ఒక్కటేనని, ప్రజా ప్రభుత్వం రావాలన్నదే ఆ కూటమి ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు వై.రామయ్య, ప్రసాద్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, నడిపెన్న, గిరీశ్వర్ రెడ్డి, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మిడుతూరు, ఏప్రిల్ 7: వివిధ గ్రామాల్లో రెండు పేకాట శిబిరాలపై దాడి చేసి పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. మండలంలోని చెరుకుచెర్ల గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3100 నగదు, వీపనగండ్ల గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా ఓటమి ఖాయం

- డబ్బులతో రాజకీయం చేస్తున్నారు
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 7: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఓడిపోవడం ఖాయమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ శ్రీశైల నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నారన్నారు. ఇంకా అనేక గ్రామాల్లో మరెన్నో చేరికలు ఉన్నాయని తెలిపారు. దీన్ని చూసి ఎమ్మెల్యే శిల్పాకు ఓటమిఇ భయం పట్టుకుందని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే శిల్పా ఐదేళ్లలో చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రత్యేకించి సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని గాలికి వదిలేశారని, అందుకే ఆత్మకూరు మండలంలో నేడు తాగు,సాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడాల్సిన దుస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం గ్రామాల్లో వర్గపోరును ప్రోత్సహించి జనాల మధ్య చిచ్చులు పెట్టారని ఆరోపించారు. ఇవన్నీ ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థమవుతున్నాయని, అందుకే వచ్చే ఎన్నికల్లో ఆయన్ని ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇకపోతే ఎమ్మెల్యే శిల్పాపై ప్రజాభిమానం లేకపోవడంతో కేవలం డబ్బు సంచులతో రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. శిల్పా లాంటి పొలిటికల్ వ్యాపారులకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. అదేవిధంగా ఎక్కడి నుంచో వలసొచ్చిన ఎమ్మెల్యే శిల్పాకు ఇక్కడి ప్రజల కష్టాలేవి తెలియని, తాను పక్కనే ఉన్న వేల్పనూరు బిడ్డనని, ఏకష్టం వచ్చినా ఇక్కడి ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బుడ్డాను టీడీపీ శ్రేణులు భారీ గజమాలతో సత్కరించారు. పార్టీలోకి చేరిన వారిలో నరేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, రోశయ్య, వెంకటేశ్వర్లు, శ్రీరామ్‌నాయక్ తదితరులు ఉన్నారు. ఆ పార్టీ నాయకులు రమేష్, రాముడు, జనసేన పార్టీ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

వైసీపీ కబ్జాకోరులను తరిమి కొట్టాలి: గౌరు చరిత



మద్దూరులో మాట్లాడుతున్న గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 7: వైసీపీ కబ్జాకోరులను తరిమికొట్టాలని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత పిలుపునిచ్చారు. మండలంలోని మద్దూరులో టీడీపీ శంఖారావం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే మద్దూరు అభివృద్ధి జరిగిందన్నారు. మద్దూరు నుంచి తొగర్చేడు, మద్దూరు నుంచి భూపనపాడు గ్రామాలకు వెళ్లే రహదారులకు టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసి టెండర్లు పిలిచినా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కబ్జాలే ధ్యేయంగా వైసీపీ ఎమ్మెల్యే, అనుచరులు పని చేస్తూ అక్రమంగా సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. పాణ్యంలోని నూలుమిల్లు, స్టీల్ ప్లాంటులను తెరిపించే దిశగా కృషి చేయట్లేదన్నారు. నియోజకవర్గాన్ని దోచేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. ప్రజల మేలు కోరే పార్టీని గెలిపించుకోవాలని కోరారు. సైకో పాలనను వదిలించుకోవాలంటే టీడీపీ పాలన ఎంతో అవసరమన్నారు. అన్ని వర్గాల ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, వైసీపీకి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, సూపర్‌సిక్స్ పథకాలు పేద బడుగు వర్గాల అభివృద్ధి కోసమే రూపొందించారని అన్నారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా టీడీపీ మహిళల కోసం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. తల్లికి వందనం లోభాగంగా ఇంట్లో చదివే పిల్లలందరికీ ప్రతి ఏటా రూ. 15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అందిస్తుందని అన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ. 3 వేలు జీవన భృతి కింద అస్తామని చెప్పారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తారన్నారు. ఇంటింటికి మంచి నీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత తాగునీటి కొళాయి కనెక్షన్ కల్పిస్తామన్నారు. పేదలను సంపన్నులను చేసే కార్యక్రమం చేపడతారన్నారు. ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం చేకూరేలా టీడీపి మానిఫెస్టో తయారు చేసిందన్నారు. అనుపూరు, మద్దూరు గ్రామాలకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి ఎంపీటీసీ రంగరమేష్, భాస్కరరెడ్డి, ఇల్లూరు భూపాల్, బ్రహ్మానందరెడ్డి, బ్రహ్మం ఆచారి, అహ్మద్ హుశేన్, నారాయణ, మండల టీడీపి నాయకులు పాల్గొన్నారు. .

'రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసిన వైసీపీ'



హమాలీ యూనియన్ సభ్యులతో మాట్లాడుతున్న ఫరూక్

నంద్యాల(నూనెపల్లె), ఏప్రిల్ 7: వైసీపీ ప్రభుత్వం రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసిందని నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. స్థానిక గాంధీ చౌక్ నందు ఆదివారం నంద్యాల లారీ హమాలీ యూనియన్ సభ్యులను కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి రోజువారీ కూలీలు చేసుకుంటూ జీవించే హమాలీల అభివృద్ధిని ప్రభుత్వం మరిచిందన్నారు. హమాలీలకు పనులు లేకుండా చేసిందన్నారు. టీడీపీ హయాంలో ట్రాన్స్‌పోర్టు రంగం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. హమాలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన కొత్తపల్లి వైసీపీ నాయకులు, కార్యకర్తలు

కొత్తపల్లి, ఏప్రిల్ 7: కొత్తపల్లిలో ఆదివారం నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో సుమారు 400 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి, కొత్తపల్లికి చెందిన టీడీపీ నాయకులు శ్రీనాథరెడ్డి, మోహన్ యాదవ్, నాగేశ్వరరావు యాదవ్‌ల ఆధ్వర్యంలో గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జయసూర్య మాట్లాడుతూ కొత్తపల్లిలోని బీసీ కాలనీకి చెందిన 150 మంది, మడ్డిపేట కాలనీకి చెందిన సుమారు 50 మంది, చెంచుగూడెంలో గిరిజనులు సుమారు 50 మంది టీడీపీలో చేరినట్లు చెప్పారు. అనంతరం జయసూర్య పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకో జగన్ రాక్షస పాలన అంతమొందాలంటే చంద్రబాబును సీఎంగా చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, జడ్.వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, శివారెడ్డి, మాదుగుల లింగన్న, జానకీరాముడు, నడిపెన్న, పరమేశ్వరరెడ్డి, మాదుగుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం: బైరెడ్డి



బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు

నంద్యాల(నూనెపల్లె), ఏప్రిల్ 7: టీడీపీతోనే ముస్లిం మైనార్టీలకు సంక్షేమం, రక్షణ అని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాలలోని టీడీపీ ఎంపీ కార్యాలయంలో నంద్యాల పట్టణానికి చెందిన వంద మంది ముస్లింలు టీడీపీలోకి చేరారు. బైరెడ్డి రాజశేఖరరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రస్తుత వైసీపీ రద్దు చేసిందని, కేవలం ముస్లింలను వైసీపీ ఓటు బ్యాంకుగానే పరిగణిస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట వేయనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లిం, మైనార్టీ నాయకులు ఉన్నారు.

వైసీపీ నాయకుడిని కఠినంగా శిక్షించాలి

- మహిళపై అసభ్యంగా ప్రవర్తించినా తూతూమంత్రంగా కేసు
- టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు ఏప్రిల్ 7: అలియాబేగం అనే ముస్లిం మహిళపై వైసీపీ మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి అసభ్యంగా ప్రవర్తిస్తే తూతూమంత్రంగా కేసు నమోదు చేశారని, వైసీపీ నాయకుడిని కఠినంగా శిక్షించి మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరులోని పార్టీ కార్యాలయంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, మాండ్ర శివానందరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాండ్ర మాట్లాడుతూ వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ముస్లిం మహిళపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమె కుటుంబ సభ్యులను చెప్పుతో కొట్టడం అమానుషమని అన్నారు. శ్రీనివాసరెడ్డి బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ముఖ్య అనుచరుడు కావడంతోనే పోలీసు భయపడుతూ తూతూ మంత్రంగా కేసులు నమోదు చేశారని మాండ్ర ఆరోపించారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ముస్లిం మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వైసీపీ నాయకుడిపనై బెయిలబుల్ కేసులు పెట్టి రాత్రికిరాత్రే ఇంటికి పంపుతారా? అని పోలీసులను ప్రశ్నించారు.

'అభ్యర్థి మార్పు ప్రచారంలో వాస్తవం లేదు'

నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్యను మార్చే అవకాశం ఉందని సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులలో వాస్తవం లేదని మాండ్ర శివానందరెడ్డి, మల్లెల రాజశేఖర్ గౌడ్ అన్నారు. టీడీపీలో అలజడి రేపేందుకే అభ్యర్థి మార్పు అంటూ వైసీపీ నాయకుల కుట్ర చేస్తున్నారని, టీడీపీ కార్యకర్తలు ఎవరూ నమ్మవద్దని ఆయన సూచించారు.

శాంతిరామ్‌ను కలిసిన బైరెడ్డి, ఫరూక్

నంద్యాల(నూనెపల్లె), ఏప్రిల్ 7: ఆర్‌జీఎం విద్యా సంస్థల చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు డాక్టర్ మిద్దె శాంతిరామ్‌ను ఆదివారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి నంద్యాలలో కలిశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలపాలని కోరారు. అయితే ఇటీవల వైసీపీలోకి చేరిన శాంతిరాముడిని టీడీపీ సీనియర్ నాయకులు కలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. వీరి చర్చ వైసీపీ క్యాడర్‌లో కలకలం రేపుతోంది.

'నీటిని పొదుపుగా వాడుకోవాలి'

నంద్యాల టౌన్, ఏప్రిల్ 7: నంద్యాల పట్టణంలోని ప్రజలందరూ మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గినందు వల్ల పురపాలక సంఘం సరఫరా చేస్తున్న నీటిపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. పురపాలక సంఘం పరిధిలో ప్రస్తుతం ఉన్న నీటి సరఫరా వ్యవస్థలన్నింటినీ పూర్తిస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడుపుతున్నట్లు తెలిపారు. నీటి సరఫరాలో సమస్య ఉన్న ప్రాంతాల్లో 6 నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. నీటి సమస్యపై ఫిర్యాదును ప్రజలు హెల్ప్ లైన్ నంబరు 7702776048 కు ఫోన్ చేసి ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల మధ్య ఎప్పుడైనా తెలుపవచ్చునని, వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే నీటి సరఫరా విభాగం సిబ్బంది పరిశీలించి తగిన చర్యలు తీసుకోకుంటారని కమిషనర్ తెలిపారు.

అడుగంటిన జలాలు

- ఎండుతున్న పంటలు
- వర్షాధారిత గ్రామాల్లో సాగు నీటి కొరత





తమ్మరాజుపల్లెలో ఎండిపోయిన మొక్కజొన్న, ఆముదం పంటలు



ఎండిపోయిన బోరు



పశువులకు వదిలేసిన వంకాయ పంట

పాణ్యం, ఏప్రిల్ 7: మండలంలోని వర్షాధారిత గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. మండలంలోని వర్షాధారిత గ్రామాలైన తమ్మరాజుపల్లె, కందికాయపల్లె, పిన్నాపురం గ్రామాలు ఇప్పటికే సాగునీటితోపాటు తాగునీటి కొరత పెరిగింది. ఈ రబీలో మండలంలో 13,893 ఎకరాలు వివిధ పంటలు సాగయ్యాయి. కాగా వర్షాధారిత గ్రామాలలో గత ఐదు నెలలుగా ఒక్కవర్షం చుక్క రాలకపోవడంతో ఈ గ్రామాలలోని వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు తగ్గి ఎండిపోయాయి. దీంతో రైతుల వేసిన ఆదుతడి పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ గ్రామాలలో మిరప, కంది, జొన్న, మినుము, వరి, కొర్ర, వేరుశనగ, ఆముదం, ఉల్లి, చామంతి, చిక్కుడు, బెండ, పొగాకు, మొక్కజొన్న, వంకాయ పంటలు సాగయ్యాయి. పిన్నాపురంలో 36 బోర్లు ఉండగా 58. 33 ఎకరాలు, తమ్మరాజుపల్లెలో 360 బోర్లు ఉండగా 474 ఎకరాలు, కందికాయపల్లెలో 38 బోర్లు ఉండగా 924 ఎకరాల పంటలు సాగయ్యాయి. పంటలు చేతికందకముందే నీటి ఎద్దడి ఏర్పడడంతో పంటలను దక్కించుకుకోవడానికి వేలాది రూపాయల ఖర్చు చేస్తున్నారు. అయినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. ఒక వైపు ఎండడుతున్న పంటలు మరోవైపు బోర్ల ఏర్పాటు తో ఈ మూడు గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలు కళ్ల ముందే ఎండి పోతుండడంతో రైతులు పశువులకు పంటలు వదలాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

400 అడుగుల బోరు వేసినా నీరు లేదు



ఈఏడాది రబీలో 6.50 ఎకరాలలో పంటలు వేశాను. ఐదు నెలలుగా వర్షం లేక బోర్లు ఎండిపోవడంతో రూ.42 వేలు ఖర్చు చేసి బోరువేసినా ఫలితం లేదు. మూడెకరాలలో మొక్కజొన్న పంటకు రూ. 50 వేలు, రెండెకరాల ఆముదాల పంటకు రూ. 20వేలు, అరెకర కనకాంబరాల సాగుకు రూ. 25 వేలు పెట్టుబడి పెట్టాను. నీటి ఎద్దడితో రూ. 1.50 లక్షలు నష్టపోయాను. ఎకరా నిమ్మ తోట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. గ్రామ పంటలకు ఎగువన ఉన్న ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మిస్తే ఎండకాలంలో రైతులు నష్టపోయే పరిస్థితి ఉండదు. గ్రామానికి ఏటిపాయ చెక్ డ్యాం నిర్మాణం గుండెకాయ వంటిది. ప్రజాప్రతినిధులు నిర్లక్షం వహిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- శ్రీనివాసులు, రైతు, తమ్మరాజుపల్లె

పంటను పశువులకు వదిలేశాను

ఎకరా వంగ పంట సాగుచేశాను. దాదాపు రూ. 30 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో బోర్లు ఎం డిపోవడంతో పంట ఎండిపోయి పశువులకు వదిలేయాల్సి వచ్చింది. చేతికందాల్సిన లక్ష రూపాయల దిగుబడి వర్షాభావ పరిస్థితితో ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఏటిపాయ చెక్ డ్యాం నిర్మాణంతో గ్రామానికి తాగునీరు, సాగునీరు అందుబాటులో ఉంటుంది. సాగునీటి కాల్వలు లేకపోయినా ఏటపాయ చెక్ డ్యాం నిర్మాణంతో రైతుల కష్టాలు తొలగిపోతాయి.

- మద్దిలేటి, రైతు తమ్మరాజుపల్లె

నీటిని సమీప గ్రామానికి తెప్పించలేకపోతున్నారు



70 కిలోమీటర్ల దూరంలోని డోన్ నియోజకవర్గంలోని గొంతెండుతున్న ఎనిమిది మండలాలకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ.480 కోట్లు ఖర్చు చేసి తాగు నీరు తీసుకుపోతున్నారు. ఆరు కిలోమీటర్ల దూరంలో గొంతెండుతున్న తమ్మరాజుపల్లె, పిన్నాపురం గ్రామాలకు గోరుకల్లు నీటిని తెచ్చుకోలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. ఎండకాలం వస్తే గొంతెండుతుందన్న గ్రామానికి నీరు అందించడంలో ఆపసోపానాలు పడుతున్న నాయకులు, అధికారులు ఏటిపాయ చెక్ డ్యాం నిర్మాణానికి సహకరించడం లేదు. చెక్‌డ్యాం నిర్మాణంతో తమ్మరాజుపల్లె పరిధిలోని 20 వేల ఎకరాల భూముల భూగర్భ జలాలు పెరిగి సాగునీటి సమస్యతో పాటు తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయి. ప్రతి యేటా నాయకులు తమహామీలలో ఏటిపాయను వాడుకుం టున్నారే తప్ప నిర్మాణాన్ని మాత్రం చేపట్టడంలేదు. నిర్మాణం నుంచి తప్పించుకోవడానికి అధికారులు చెక్‌డ్యాం కింద సాగులేదని కొత్తపాట పాడుతుండడం రైతులకు అన్యాయం చేయడమే.

- దుబాయ్ శీను, టీడీపీ నాయకుడు, తమ్మరాజుపల్లె

వేసవిలో అల్లాడుతున్న మూగజీవాలు

- వాగులు, వంకలు, చెరువుల్లో కనిపించని నీటి నిల్వలు
- బీటలువారుతున్న పంట పొలాలు



ఖాళీగా దర్శనమిస్తున్న సిద్దాపురం చెరువు



ఆత్మకూరు పట్టణ శివార్లలో ఎండిపోయిన పడేవాగు

ఆత్మకూరు, ఏప్రిల్ 7: వేసవి కష్టాలు మనుషులకే కాదు పశుపక్షాదులకు శాపంగా మారుతోంది. ప్రచండభానుడి ప్రతాపంతో పశువులకు పశుగ్రాసంతో పాటు నీటికి తిప్పలు తప్పడం లేదు. దీంతో ఆకలితో అలమటిస్తూ.. నోరులేని మూగజీవాలు పడుతున్న వేదన అంతాఇంతా కాదు. ఆత్మకూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వున్న వాకులు, వంకలు ప్రస్తుత ఎండల ప్రభావంతో ఖాళీగా దర్శనమిస్తున్నారు. చెరువుల్లో సైతం భూమి నెర్రలిచ్చి కరువు ఛాయలను ప్రతిబింబిస్తోంది. ఈ కోవలోనే ఆత్మకూరు పట్టణ శివార్లలోని భవనాశి నదీ, పడేవాగుతో పాటు కొట్టాలచెరువు, ఇందిరేశ్వరం, సిద్దాపురం, వెంకటాపురం, కరివేన తదితర గ్రామాల్లోని చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో పశువులకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వాస్తవానికి పాడిపశువులకు రైతులు తమ ఇంటి వద్ద ఇచ్చే గ్రాసంతో పాటు పొలాల గట్ల వెంట ఉండే పచ్చగడ్డిని తినడం వల్ల పశువుల ఆకలి తీరుతోంది. అయితే బావులు, వాగులు, వంకలు, నీటి నిల్వల ప్రదేశాలన్నీ ఎండిపోవడం వల్ల పచ్చగడ్డి కరువై పశువులు ఆకలితో అల్లాడుతున్నాయి. దీంతో కోత కోసిన పంటల్లో పడిన గ్రాసాన్ని తినాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే వాగుల్లో, వంకల్లో నీటిని సేవించడంతో పాటు నీటికుంటల్లో పశువులు సేదతీరుతుంటాయి. అయితే నీటి నిల్వలే లేకపోవడం వల్ల అధిక ఉష్ణోగ్రతల నుంచి పశువులకు ఉపశమనం లేకుండా పోయింది. కాగా గత టీడీపీ పాలనలో పాడిపశువుల పోషణలో భాగంగా ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ఆయా గ్రామాల్లో నీటితొట్టిలను ఏర్పాటు చేసింది. పాడిపశువులకు దాహార్తి తీర్చేందుకు ఆయా నీటితొట్టిల్లో ఎప్పటికప్పుడు నీటినిల్వలు అందుబాటులో ఉంచేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక నీటితొట్టిల నిర్వహణ గాలికి వదిలేయడంతో పాడిపశువులకు గ్రామాల్లో నీటికష్టాలు తాండవం చేస్తున్నాయి. అదేవిధంగా వేసవిలో పాడిపశువులకు సంబంధించి సబిడీ పథకాల నిర్వహణ కూడా సక్రమంగా జరగలేదని విమర్శలు ఉన్నాయి. ఎండల ప్రభావం వల్ల పాడిపశువులు ఎదుర్కొంటున్న కష్టాలను గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల పాడిరైతులు కోరుతున్నారు.



ఎండలతో బీటలువారిన చెరువు

హార్మోనిస్టుకు సత్కారం



హార్మోనిస్టును సత్కరిస్తున్న బ్రహ్మానందాచారి

బనగానపల్లె, ఏప్రిల్ 7: బనగానపల్లె మండలం పలుకూరు గ్రామం స్థానిక రామాలయంలో మనం ఫౌండేషన్ సహకారంతో జెకె ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి ఆధ్వర్యంలో హార్మోనిస్టు కళాకారుడు బాల హనుమంతును ఘనంగా సత్కరించారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా బాలహనుమంతు తబలా కళాకారుడుగా గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కెవి. వెంకట సుబ్బయ్యగౌడ్, శ్రీనివాసులు, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

అహోబిలం చేరుకున్న పీఠాధిపతి

నంద్యాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆదివారం అహోబిలం చేరుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకొని ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పీఠాధిపతి తిరుమలలో జరిగిన అన్నమాచార్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఇక్కడకు చేరుకున్నారు.

గోవులకు వరిగడ్డి దానం

రుద్రవరం, ఏప్రిల్ 7: రుద్రవరం మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వెంకోబరావు రూ.1.50 లక్షలు వెచ్చించి ఆశ్రమాల్లో ఉంటున్న గోవులకు వరి గడ్డిని దానంగా అందించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు సమీపంలోని గోపులపురి ఆశ్రమం, అహోబిలం శ్రీధర్‌గురుజీ ఆశ్రమం, ఆళ్లగడ్డ శంకరానంద ఆశ్రమం, ముద్దనూరు ఆశ్రమాల్లో ఉన్న గోవులకు పశుగ్రాసం తరలించి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల నుంచి వరిగడ్డిని ఆశ్రమాల్లో ఉన్న గోవులకు తీసుకెళ్లి అప్పగిస్తున్నామన్నారు.

'రెండు బోర్లకు నిధులు మంజూరు'

రుద్రవరం, ఏప్రిల్ 7: నల్లమల అటవీ పరిధిలోని రుద్రవరం రేంజ్‌లోని వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు బోర్లు వేయడానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ టైగర్ ప్రాజెక్టు బీఎన్ఎన్ మూర్తి నిధులు మంజూరు చేసినట్లు రేంజర్ శ్రీపతినాయుడు ఆదివారం తెలిపారు. బోర్లు వేసేందుకు జియాలజిస్టుతో పాయింట్లు కూడా గుర్తించినట్లు తెలిపారు. ఈ బోర్లు వేస్తే వన్యప్రాణులకు ఇటు భక్తులకు దాహం తీర్చుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని ఆయన అన్నారు.

జగత్ విఖ్యాత్‌రెడ్డి పరామర్శ

రుద్రవరం, ఏప్రిల్ 7: మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన నరసింహుడు (60) అనే వ్యక్తి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి చందలూరు గ్రామనికి వెళ్లి నరసింహుడు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల దగ్ధం

చాగలమర్రి, ఏప్రిల్ 7: చాగలమర్రి గ్రామంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలోగల ఓ గృహంలో షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. ఆరోగ్య కార్యకర్త మంజుల నివాసంలో అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ ప్రమాద సమయంలో ఇంటి బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. గృహంలో ఉన్న ఏసీ, ఫ్యాన్‌లు, విద్యుత్ బల్బులతో పాటు వివిధ వస్తువులు దగ్ధమై రూ.లక్ష దాక నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ అగ్నిమాపకసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, జెట్టి నాగరాజు, అబ్దుల్‌ఖాదర్ దగ్ధమైన వస్తువులను పరిశీలించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించడం ఎంతో బాధాకరమని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కాలిపోయిన వస్తువులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

'టీడీపీతోనే బీసీల సాధికారత'

చాగలమర్రి, ఏప్రిల్ 7: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. ఆదివారం బీసీ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని అన్నారు. చంద్రబాబు హయాంలో బీసీ సబ్ ప్లాన్ కింద రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు. బీసీలకు ఆదరణ పనిముట్లు అందజేసి ప్రోత్సహించారన్నారు. బీసీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి నిరుద్యోగ యువతను ఆదుకున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్‌లతో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై బీసీలు ఓటుతో గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'హిందూ ధర్మాన్ని కాపాడాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడాలని స్వామిజీ అభినవ శంకరానందస్వామి సూచించారు. ఆదివారం శివరామానంద ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హిందువులు ధర్మాన్ని కాపాడేందుకు కృషి చేయాలని అన్నారు. గడపగడపకు ధర్మప్రచారాన్ని తీసుకెళ్లాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతన కలిగి దైవమార్గాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు


రుద్రవరం, ఏప్రిల్ 7: రుద్రవరంలోని సంతాన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్‌వేణగోపాల స్వామి, సత్యభామ రుక్మిణీ అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఏప్రిల్ 7: మండలంలోని యల్లావత్తుల , రుద్రవరం, చిన్నకంబలూరు, కొండమాయపల్లె గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఒట్టిపోయిన వక్కిలేరు

చాగలమర్రి, ఏప్రిల్ 7: మండలంలోని పెద్దబోదనం, కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె, మల్లేవేముల గ్రామాల సమీపంలోగల వక్కిలేరు నీరు లేక ఒట్టిపోయింది. వేసవి కాలంలో నీరు లేకపోవడంతో రైతులు, మూగ జీవాలు, కూలీలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలకు ముందే నీరు లేకపోవడంతో వక్కిలేరు పరిసర గ్రామాల ప్రజలు తాగు, సాగు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. ఎగువ నుంచి వక్కిలేరుకు నీరు విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెద్దబోదనంలో ఒట్టిపోయిన వక్కిలేరు



బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన ఆకుమళ్ల వైసీపీ నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

బనగానపల్లె, ఏప్రిల్ 7: బనగానపల్లె నియోజకర్గంలోని వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆదివారం సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సమక్షంలో ఆకుమళ్ల గ్రామానికి చెందిన నాసారిబుల్లి, కాళింగారి సుంకన్న, గజ్జెల నడిపిరాముడు, కొట్టం చిన్నరాముడు, మల్లికార్జున, రామచంద్రుడు తదితర 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తదితరులు టీడీపీలో చేరారు. వీరికి బీసీ ఇందిరమ్మ టీడీపీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆకుమళ్ల గ్రామస్తులు మాట్లాడుతూ టీడీపీ వల్లనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీ మారినట్లు తెలిపారు.

పేరుసోములలో 80 కుటుంబాలు టీడీపీలో చేరిక

సంజామల , ఏప్రిల్ 7: మండలంలోని పేరుసోముల గ్రామంలో వైసీపీకి ఆదివారం భారీ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సమక్షంలో 80కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన మహేష్, సత్యబాబు, రమేష్, చెన్నయ్య, బందెల రాజు, మహేష్, ఏసురత్నం, శాంతయ్య, విజయ్, బాల తిమ్మయ్య, తదితర మొత్తం 80 కుటుంబాలు చేరారు. బీసీ ఇందిరమ్మ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు బెలుం సురేశ్‌రెడ్డి, శీలంవెంకటేశ్వర్లు, ఏళ్ల శ్రీనివాసులు, నాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, కైప మహేశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రావు, ప్రచార కార్యదర్శి పల్లెరోగి మహేశ్‌తో పాటు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన పేరుసోముల వైసీపీ నాయకులు

టీడీపీతోనే క్రైస్తవుల అభివృద్ధి: కోట్ల

టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 7: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే క్రైస్తవుల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కోట్ల నివాసంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసు ఆధ్వర్యంలో క్రైస్తవులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి సూపర్‌సిక్స్ పథకాల పోస్టర్లను విడుదల చేశారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 277 చర్చిలకు రూ.45 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. విదేశీ విద్య పథకం కింద క్రైస్తవ పిల్లలు 68 మందికి ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు 4,300 మందికి ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. టీడీపీ క్రిస్టియన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసు మాట్లాడుతూ సీఎం జగన్ క్రైస్తవులకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. టీడీపీ అభ్యర్థుల గెలుపునకు క్రైస్తవుల మద్దతు ఉంటుందన్నారు.



టీడీపీ క్రిస్టియన్ నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోట్ల

ప్రజలను దోచేసిన ఇసుక మాఫియా

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 7: డోన్ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఇసుక మాఫియా అవతారమెత్తి ప్రజలను నిలువునా దోచేశారనీ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం మండలంలోని దేవరబండ గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు ఇంటింటికి తిరిగి ప్రజలకు అందజేశారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులే ఇసుక మాఫియా ముఠాగా ఏర్పడి బ్లాకుల్లో ట్రాక్టరు ఇసుకును రూ.6వేలకు విక్రయించి జేబులు నింపుకున్నారనీ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచితంగా ప్రజలకు ఇసుకను అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, దేవరబండ వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, మిద్దెపల్లి గోవిందు, లోకేశ్వరరెడ్డి, మధుగౌడు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ఎన్నికల్లో సైకో జగన్ అరాచక పాలనకు ఇంటికి పంపించి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సుపరిపాలన రావాలని డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ పేర్కొన్నారు. ఆదివారం నగర పంచాయితీలోని 12వ వార్డు సంజీవనగర్‌లో వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి, రామ్మూర్తి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుగ్గన మాదవిరెడ్డి, మోహన్‌గౌడు, బక్క బాలుడు, జగదీష్, జనసేన నాయకులు శ్రీకంఠ మధు, మహిళలు పాల్గొన్నారు.

కోట్ల చిత్రమ్మ సమక్షంలో బేతంచెర్లలోని అన్ని మసీదులకు చెందిన ముస్లింలకు ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు జాకీరుల్లా బేగ్, రవీంద్ర నాయక్, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, కోట్ల గిరిధర్ రెడ్డి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



దేవరబండ గ్రామంలో కోట్ల సుజాతమ్మ ఎన్నికల ప్రచారం

వైసీపీకి గుణపాఠం తప్పదు: అఖిలప్రియ

శిరివెళ్ల, ఏప్రిల్ 7: ఐదేళ్ల అధికారంలో వైసీపీ ప్రజాప్రతినిధులు గ్రామాలను అభివృద్ధి చేసి ఉంటే.. నేడు ప్రజల కాళ్లు పట్టుకుని ఓట్లు అడిగే దుస్థితి వచ్చేది కాదని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. శిరివెళ్లలోని 5, 6వ వార్డుల్లో ఆమె ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించి టీడీపీ అందించబోయే పథకాలను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలను పరిష్కరించేందుకు తాము ఎళ్లవేళలా ముందుంటామని.. అందుకే ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓట్లు అడిగే అర్హత టీడీపీ అభ్యర్థిగా తనకే ఉందని అన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కలెక్టర్ స్పందించి చెరువులు, కుంటలు నింపుకునేందుకు నీటిని విడుదల చేయాలని ప్రజల తరపున ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలు తీర్చకుండా కాలక్షేపం చేసిన వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పరిపాలన అట్టర్‌ప్లాప్ అయిందని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఫిదా హుసేన్, బాలచంద్రుడు, తిరుమల రవి, పీపీ లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.



శిరివెళ్లలో పథకాల గురించి వివరిస్తున్న భూమా అఖిలప్రియ

సీతారాములకు విశేష పూజలు



కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఏప్రిల్ 7: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ ఆలయాల్లో ఆదివారం సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాములకు జల, క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకం చేశారు. మహిళలు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా సభ్యులు 108 దీపాలతో ప్రత్యేక హారతులు ఇచ్చి దీపోత్సవం చేశారు. అలాగే గంగమ్మ, చాగలమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

రుద్రవరం, ఏప్రిల్ 7: రుద్రవరం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ చెప్పారు.

తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 7: కోవెలకుంట్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వరప్రసాద్ త్రైత సిద్ధాంతం తెలుగు ఉగాది క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక కోవెలకుంట్ల కమిటీ అధ్యక్షుడు జనార్దన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, మధుసూదన్, సూర్యుడు, వెంకటరమణ, సుబ్బరాయుడు, చౌడయ్య, సుదాకర్, సుగుణ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

చాగలమర్రి, ఏప్రిల్ 7: చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో దూదేకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా, రంజిత్, కమిటీ సభ్యులు కలిసి రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పేదలకు బియ్యం, చక్కెర, సేమియా, గోదుమ పిండి, ఆయిల్ ప్యాకెట్, కూరగాయలను అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పీరయ్య, లాలుబాషా, ఇమామ్‌బాషా పాల్గొన్నారు.



రంజాన్‌తోఫా అందజేస్తున్న అధ్యక్షుడు మహబూబ్‌బాషా

ముస్లింలకు ఇఫ్తార్

రుద్రవరం, ఏప్రిల్ 7: మండలంలోని ఆలమూరు గ్రామంలో ముస్లింలకు ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గ్రామంలోని జామియా మసీదులో ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో భార్గవరామ్ నాయుడు ముస్లింలకు భోజనం వడ్డించారు. అనంతరం ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో ఆలమూరు నారాయణ, ఎస్‌వీ ప్రసాద్ రెడ్డి, ముల్లరాజా, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌హుసేన్, వేణుగోపాల్, టీబీ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో భోజనం వడ్డిస్తున్న భార్గవరామ్ నాయుడు

సంజామల : కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ ఆదివారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మండల కేంద్రం సంజామలలోని మూడు మసీదులకు సంబంధించిన ఉపవాస దీక్షకులకు, గ్రామంలో ఉపవాస దీక్షలో ఉన్న మహిళలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అన్వర్ మౌలానా, మాజీ ఎంపీటీసీ యూసుఫ్‌హుసేన్, రెడ్డి మగ్బుల్, ఆర్‌మహమ్మద్‌హుసేన్, కోఆప్షన్ సభ్యులు మగ్బుల్‌హుసేన్, రియాజ్ హుసేన్, టీడీపీ నాయకులు తోకలమద్దిలేటి, మల్కిహుసేన్, మైనార్టీ ఉపాధ్యక్షులు పసుపమ మహమ్మద్, రవి, సుబ్బారావు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న పెండేకంటి

వైసీపీకి షాక్..

● టీడీపీలో చేరిన జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్

ప్యాపిలి, ఏప్రిల్ 7: వైసీపీకి గట్టి షాక్ తగిలింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ గార్లదిన్నె సీమ సుధాకర్ రెడ్డి, ఆయన సతీమణి సర్పంచ్ సీమ మనోహరమ్మలు కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం మండలంలోని గార్లదిన్నె గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే వైసీపికి చెందిన మాజీ సర్పంచ్ మెట్టు రాజశేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శివశంకర్ రెడ్డిలతో పాటు దాదాపు వైసీపీకి చెందిన వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచుకున్నారు. గార్లదిన్నె సీమ సుధాకర్ రెడ్డి మూడు దఫాలు ప్యాపిలి మండలంలోని హుశేనాపురం సింగిల్ విండో అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం ఆయన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఈయన టీడీపీలో చేరడంతో ఇక్కడ వైసీపీకి పెద్ద దెబ్బే తగిలింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమా మహేశ్వర స్వామి కల్యాణోత్సవం

బనగానపల్లె, ఏప్రిల్ 7: బనగానపల్లె మండలంలోని యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి క్షేత్రంలో ఉమామహేశ్వర కళ్యాణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ, ఇతర అర్చకుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బుగ్గనకు ఓటమి భయం పట్టుకుంది: టీడీపీ



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

డోన్, ఏప్రిల్ 7: డోన్ నియోజకవర్గంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న మంత్రి బుగ్గనకు ఓటమి భయం పట్టుకుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడుతో కలిసి వై.నాగేశ్వరరావు యాదవ్ విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి బుగ్గన సమాధానం చెప్పలేక తప్పుడు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతుంటే.. అభివృద్ధి అంటే ఇదేనా అని కోట్ల ప్రశ్నించడం తప్పా అని ఎద్దేవా చేశారు. బుగ్గనకు కోట్లను విమర్శించే అర్హత లేదన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతుందని, బుగ్గనను ఓడించి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ఆర్‌ఈ నాగరాజు, చిట్యాల మద్దయ్యగౌడు, భూమా నాగన్న, మాధవరం స్వామి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి



కార్యక్రమానికి హాజరైన మహిళలు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 7: తెలుగేదశం పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, మండల తెలుగుయువత అధ్యక్షుడు గొంగటి వుశేన్‌రెడ్డి ఉన్నారు. ఆదివారం మండలంలోనిప పెట్నికోట గ్రామంలో వారు మాట్లాడుతూ బీసీలంతా ఏకమై సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి వైసీపీని సాగనంపాలన్నారు. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లెలో నంద్యాల రామేశ్వర రెడ్డి, చింతలాయపల్లెలో అంబటి జయలక్ష్మి రెడ్డి, అంబటి ప్రకాష్‌రెడ్డి, పెట్నికోట గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు ఉసేన్ రెడ్డి జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో బీసీలందరిని ఏకంచేసి తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బీసీ మహిళలు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



జూనుంతలలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

అవుకు, ఏప్రిల్ 7: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నాయకులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మొట్ల రామిరెడ్డి అన్నారు. ఆదివారం అవుకు మండలంలోని జూనుంతల గ్రామంలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రయంలో టీడీపీ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, పివి వెంకటేశ్వర్లు ,మధు, శివ బాలాజి, నరసింహ అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

బేతంచెర్ల, ఏప్రిల్ 7: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024 పాలిసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు తేదీని ఈ నెల 27 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ ఆదివారం తెలిపారు. ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఇప్పటికే మార్చి 30 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ ప్రారంభించడమైనదని, 142 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని హాజరవుతున్నారన్నారు. వీరికి ఉచితంగా పాలిసెట్ శిక్షణతోపాటు మెటీరియల్ కూడా అందజేయడం జరిగిందన్నారు. పాలిసెట్‌కు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో గానీ లేదా కళాశాలలో గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వెండి హారతి పళ్లెం విరాళం



వెండి హారతి పళ్లెంను అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 7: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు వాస్తవ్యులు రఘురాం, లక్ష్మీ దంపతులు వెండి హారతి పళ్లెంను విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. 491 గ్రాముల బరువు ఉండే వెండి హారతి పళ్లెం రూ.39 వేల విలువ చేస్తుందని ఆమె పేర్కొన్నారు.